# నగ్నంగా ఫాశిస్టు కోరల ప్రదర్శన

**రోజులు** గడుస్తున్నకొద్దీ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం 'అభివృద్ధి' నినాదాన్ని వల్లేవేస్తూనే, మతపరమైన విభజనలను ప్రోత్సహిస్తూ తన ఫాశిస్టు కోరలను నగ్నంగా ప్రదర్శిస్తోంది. నరేంద్రమోడీ ఇదే తరహా వ్యూహాన్ని 2002 సం॥లో గుజరాత్‌లో అనుసరించాడు. ముస్లిం వ్యతిరేక మారణ హోమాన్ని గుజరాత్ అభివృద్ధి నమూనా పేరిటే సాగించాడు. ప్రస్తుతం, ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో విజయం సాధించాక, బిజెపి ప్రభుత్వం ఈ విధానాన్ని మరింత దూకుడుగా కొనసాగిస్తోంది.

బహుళజాతి కార్పొరేషన్లకు, భారత బడాబూర్జువాలకు ఒక ఏకీకృత మార్కెట్‌ను సృష్టించే విధంగా, అదేసమయంలో లక్షలాదిమంది చిన్న వ్యాపారులను అసమాన, అసమంజస పోటీకి గురిచేసే 'వస్తు సేవల పన్ను' (జిఎస్‌టి) బిల్లుకు బిజెపి ప్రభుత్వం ఆమోదం తెల్పింది. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులకు ఏకీకృత మార్కెట్టును కల్పించేందుకు, తద్వారా వ్యవసాయ వాణిజ్య కార్పొరేషన్లు రైతులను తుదికంటా దోపిడీ చేసుకునేందుకు సారవంతమైన భూమికను కల్పించే ఆలోచనలు సాగిస్తోంది. దీనికనుగుణంగా 'అఖిలభారత వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చట్టాన్ని' అమలులోకి తెచ్చి, రాష్ట్రాల అంశమైన 'వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్టు'ను కేంద్రప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవటానికి, రాష్ట్రాల స్థాయిలోవున్న వ్యవసాయ మార్కెటింగ్ చట్టాలన్నింటినీ రద్దుచేసేందుకు చర్యలు చేపడుతోంది.

బహుళజాతి కంపెనీలకు వ్యవసాయ మార్కెట్లను బార్లాతెరచి వుంచటం, వ్యవసాయ రంగంలోని సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తుంది. వ్యవసాయ రుణాల రద్దువంటి ఉపశమన చర్యలను వ్యవసాయరంగ మెదుర్కొంటున్న సంక్షోభానికి పరిష్కారంగా చూపెడుతూ బిజెపి ప్రభుత్వం సంక్షోభానికి మూలమైన వాస్తవిక కారణాలనుండి రైతాంగ ప్రజానీకపు దృష్టిని మళ్ళించజూస్తోంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ రుణాల రద్దును ప్రకటించగా, పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రభుత్వాలు దీనినే అనుసరించనున్నాయి.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం భారతదేశంలో తాము కొనసాగిస్తున్నామని చెబుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని సైతం అపహాస్యం చేస్తోంది. ఆర్థికబిల్లు–2017ను ఆమోదించుకునేందుకు తనకు ఆధిక్యంలేని రాజ్యసభను తప్పించుకునేందుకు, కేంద్రప్రభుత్వం ఏకంగా దాదాపు 40 కేంద్ర చట్టాలను సవరించింది. ఉదాహరణకు, కంపెనీ చట్టం–2013లోని సెక్షన్ 182ను సవరించటంద్వారా లబ్ధిపొందే పార్టీ పేరును వెల్లడిచేయకుండానే ప్రైవేట్ కంపెనీలు రాజకీయ పార్టీలకు అపరిమిత ధనాన్ని చందాగా ఇవ్వటానికి వీలు కల్పించింది. ఏ విదేశీ కంపెనీ అయినా మనదేశంలోని రాజకీయ పార్టీలకు చందాలు ఇవ్వగలిగే విధంగా విదేశీ కంపెనీయొక్క నిర్వచనాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం సవరించింది. అనేక ట్రిబ్యునళ్ళను కలిపివేసి, న్యాయమూర్తుల నియామకంలో, వారి విధుల నిర్వహణలో, ట్రిబ్యునళ్ళ సభ్యుల తొలగింపులో కేంద్ర ప్రభుత్వం తనకు ఎక్కువ అధికారం వుండేలా, ఎంతోకొంత స్వతంత్రతతో నడిచే ట్రిబ్యునళ్ళ స్వతంత్రతను తగ్గించివేసేలా చట్టంలో సవరణలు చేసింది. 'నమ్మదగిన కారణం' చాటున దాడులు సాగించే ఆదాయపు పన్ను అధికారుల అధికారాలను విస్తరిస్తూ 'వెదికి, ఆస్తులను జప్తుచేయటానికి' వీలుగా కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను చట్టాన్ని కూడా సవరించింది. కనీసం ఉన్నత న్యాయస్థానానికి కూడా కారణాన్ని వారు వెల్లడిచేయాల్సిన అవసరం లేదు. ఈ నిరంకుశాధికారాలు తాము ఎంచుకున్న వారిని వేధింపులకు గురిచేయటానికి, ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారిని బెదిరించి లొంగదీసుకునేందుకు మాత్రమే ఉపయోగిస్తారు.

కేంద్ర ప్రభుత్వం, పాడి పరిశ్రమరంగంలోకి 100శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి అవకాశం కల్పించి, విదేశీ పాడిపరిశ్రమ కంపెనీలను భారతదేశంలో తమ కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశం కల్పించింది. రెండు లేదా మూడు పాడి పశువులను కలిగి వుండి తమ కుటుంబ ఆదాయానికి తోడ్పాటుగా వుండే లక్షలాదిమంది రైతుల జీవనాధారాల్ని ఈ చర్య విధ్వంసం చేస్తుంది. విదేశీ పాడిపరిశ్రమ అవసరాలకు హెచ్చుమోతాదులో పశువుల మేత అవసరమౌతుంది కనుక, ఆ మేతకోసం పంటలు, ధాన్యాలు పండించే సారవంతమైన పంట భూములలో, అందుకు బదులుగా పశువుల మేతకు గడ్డిపెంచే భూములుగా మార్చివేస్తారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం – భారతదేశంలోని విదేశీ కంపెనీల అనుబంధ పరిశ్రమలు అందించే 'రక్షిత నిబంధనలుగా' పిలవబడే సేవా పన్నును 50 శాతం తగ్గించింది. ఇప్పటికే నోకియా, వొడాఫోన్, కెయిర్న్ ఇండియా కేసులలో స్పష్టంగా వెల్లడైన విధంగా రాయల్టీల పేరుతో మనదేశ ఆర్థిక వనరులను విదేశీ కంపెనీలు పెద్దఎత్తున తరలించుకుపోతుండగా, సేవల రూపంలో పెట్టుబడిని తరలించటానికి ప్రస్తుతం పథకాలను రూపొందిస్తున్నది. సామ్రాజ్యవాద పెట్టుబడిని, బడాబూర్జువా వర్గ ప్రయోజనాలను కాపాడే ప్రభుత్వ చర్యలనుండి ప్రజల దృష్టి మళ్ళించేందుకు, మత మైనారిటీలకు వ్యతిరేకంగా ద్వేషపూరిత ప్రచారాన్ని తీవ్రంచేస్తూ, హిందూమతతత్వ భావనలను ప్రేరేపిస్తూ ప్రజలను విభజించటానికి పూనుకుంది. కూల్చివేసిన బాబ్రీమసీదు స్థానంలోనే రామమందిరాన్ని నిర్మించి తీరాలని బిజెపి నాయకులు కాకిగోల చేస్తున్నారు. సుప్రీంకోర్టు దీనిని వెనుక్కులాగుతున్నది. చట్టపరమైన గుణదోషాలపై ఆధారపడి బాబ్రీమసీదు కేసును నిర్ణయించటంగాక, వివాదంలోని కక్షిదారులనూ న్యాయస్థానానికి బయట ఓ పరిష్కారం చేసుకొమ్మని సలహా ఇస్తున్నది. హిందూ ఛాందసవాదులు దేనినైతే వాస్తవమని నమ్మబలుకుతున్నారో, దానినే భారత ప్రధాన న్యాయమూర్తి పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా కనబడుతోంది. బాబ్రీమసీదు స్థలంలో రామందిర నిర్మాణానికి ఇది దాదాపు అనుమతినివ్వటమే.

ఏప్రిల్ మొదటివారంలో గో పరిరక్షకులుగా పేర్కొంటున్న ఓ గుంపు ఓ ముస్లిమును హత్య గావించారు. పశువుల సంతలో ఆ ముస్లిము వ్యక్తి ఓ ఆవును కొని ఇంటికి తీసుకువెళ్తుండటమే దీనికి కారణం. పార్లమెంటరీ వ్యవహారాలశాఖ సహాయమంత్రి లోక్‌సభావేదికపై ఈ మొత్తం ఘటనను పూర్తిగా నిరాకరించాడు. అంతేగాక, గోహత్యలకు పార్లమెంటు అనుకూలమనే అభిప్రాయం కలగనీయకూడదంటూ పార్లమెంటు సభ్యులను బెదిరించే ప్రయత్నం చేశాడు. ఇది అర్థరహితమైన వాదన. గత రెండు సం॥లుగా గో సంరక్షకుల పేరున ఈ మూకలు, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, 'ఆవు' కేంద్ర అంశంగా ముస్లిములపై, దళితులపై అనేక దాడులకు పాల్పడుతున్నాయి. వాటిని అడ్డగించేందుకు ప్రభుత్వమేమీ చేయలేదు. ఇప్పుడు కేంద్రమంత్రి 'ఆవుల పరిరక్షణ' అనే ఓ డొల్ల నినాదమివ్వటం మినహా, కనీసపాటి వివరణ కూడా ఇవ్వకుండానే పైన పేర్కొన్న ఘటనలో ముస్లిము హత్యను సమర్థిస్తున్నాడు.

పాలకవర్గాలు ప్రజలను విభజించి అణచివేయ టానికి కుటిలమైన విభజించి, పాలించటాన్ని ఒక విధానంగా ఉపయోగిస్తున్నారు. ప్రజలను విభజించి వారి ఐక్యతను నాశనం చేయటానికి ప్రజల నడుమ నున్న మత బేధాలను వారు ఉపయోగించుకుంటూ, విద్వేషాన్ని రెచ్చగొడ్తున్నారు.

మతతత్వ ఛాందసత్వాన్ని రెచ్చగొట్టే మొరటైన పద్ధతుల్లో బిజెపి వ్యవహరిస్తూ, దుర్మార్గమైన ప్రచారాన్ని సాగిస్తుండగా, ముసుగులో, సున్నిత పద్ధతుల్లో కాంగ్రెస్ పార్టీ ఈ విధానాలను అనుసరిస్తోంది. సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడిని, దానికి తొత్తులుగానున్న భారత బడా పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనాలను పరిరక్షించటంలో తమ లొంగుబాటును కప్పిపుచ్చుకోవటమే భారత పాలకవర్గాల లక్ష్యం.

పాలకవర్గాల దుర్మార్గ చర్యలను, ప్రత్యేకించి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మరియు వారి అనుయాయులు మత విద్వేషాలను రెచ్చగొట్టటాన్ని వెల్లడిచేస్తూ, దీనికి వ్యతిరేకంగా సంఘటితంగా నిలవటమే, విప్లవకారుల, ప్రజాస్వామికవాదుల కర్తవ్యం.

(2017 ఏప్రిల్ 'క్లాస్‌స్ట్రగుల్' సంపాదకీయం)

ooooo